21న దేవస్థాన సేవాసమితి
సర్వసభ్య సమావేశం

అంబర్‌పేట, జూలై 19 : అంబర్ పేట దేవస్థాన సేవా మితి సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన సేవా సమితి ప్రధాన కార్యదర్శి బింది మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు. బాగ్‌అంబర్‌పేట బుర్జుగల్లీలోని అంబర్‌పేట గౌడ సంఘం హాల్‌లో నిర్వహించే సమావేశంలో బోనాల నిర్వహణపై చర్చ, 2023 బోనాలు, దసరా జమాఖర్చుల వివరాలు, అధ్యక్షుడి అనుమతితో ఇతర విషయాలు చర్చిస్తామన్నారు.

గోల్కొండ ఎల్లమ్మ హుండీ
రూ. 3,91,205

మెహిదీపట్నం : ఆషాఢ బోనాల్లో భాగంగా గోల్కొండ జగదాంబిక ఆలయంలో ఇప్పటికీ నాలుగు పూజలు ముగిశాయి. శుక్రవారం ఈవో శ్రీనివాస్ రాజు, బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ అరవింద్ మహేశ్‌కుమార్ ఆధ్వర్యంలో హుండీని ఆలయ ఆవరణలో లెక్కించారు. మూడో, నాలుగో పూజలకు సంబంధించిన హుండీని లెక్కించగా రూ.3,91,205 వచ్చినట్లు ఈవో తెలిపారు. ఇప్పటి వరకు నాలుగు పూజలకు కలిసి మొత్తం రూ. 6,82,605 వచ్చినట్లు చెప్పారు.

ఆలయాల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి

జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

అంబర్‌పేట : బోనాలను పురస్కరించుకొని నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రిసిటీ అధికారులకు చెప్పారు. అవసరమైతే కొత్త వీధిదీపాలు ఏర్పాటు చేస్తూ పాడైన చోట మరమ్మతులు చేయాలన్నారు. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కార్పొరేటర్లు ఈ.విజయ్‌కుమార్‌గౌడ్, బి.పద్మావెంకటరెడ్డిలతో కలిసి జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రిసిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు చెప్పారు. ఆలయ నిర్వాహకుల సూచనల మేరకు దీపాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు, హార్టికల్చర్ అధికారులతో కలిసి సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సారి జాతర సందర్భంగా నియోజకవర్గంలోని అమ్మవారి టెంపుల్స్ వద్ద 3200 విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నామని అధికారులు ఎమ్మెల్యేకు చెప్పారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ సర్కిల్ ఈఈ సంతోష్, డీఈ శ్రీకాంత్, ఏఈ సౌమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బోనాల నిర్వహణకు చెక్కులు పంపిణీ

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు కౌసర్ మొహినుద్దీన్, శ్రీ గణేశ్

కార్వాన్, జూలై 19 : బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయంలో భాగంగా కార్వాన్, నాంపల్లి నియోజవర్గంలోని అమ్మవారి ఆలయాల నిర్వాహకులకు శుక్రవారం గుడిమల్కాపూర్‌లోని జాంసింగ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చెక్కులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్, కంటోన్మెంట్ శ్రీ గణేశ్ పాల్గొని చెక్కులు పంపిణీ చేశారు. కౌసర్ మొయినుద్దీన్ మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలోని మొత్తం 163 ఆలయాలకు గాను రూ. 73 లక్షలు అందజేసినట్లు తెలిపారు. కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయం దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నప్పటికీ 20 ఏండ్లుగా కమిటీని నియమించకపోవడంతో నూతన కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని ఆలయాల చెక్కులు పంపిణీకి రాగా దర్బార్ మైసమ్మ ఆలయం చెక్కు లేకపోవడంపై ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో గోల్కొండ తాసీల్దార్ డి. అహల్య, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషన్ బాలాజీ, జాంసింగ్ ఆలయ ఈఓ క్రిష్ణ, కార్వాన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ అల్ హజ్రీ, కాంగ్రెస్ నాయకులు పాశం రాజేందర్‌యాదవ్, టి. జీవన్ సింగ్, అరుణ్ కుమార్, కార్వాన్ కార్పొరేటర్ ఎం. స్వామియాదవ్, నానల్ నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్, గుడిమల్కాపూర్ డివిజన్ బీజేపీ నాయకుడు దేవర వంశీ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ తిరిగి అధికారం చేపట్టడం ఖాయం

తెలంగాణలో బీఆర్ఎస్ తిరిగి అధికారం చేపట్టడం ఖాయమని నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పార్లమెంట్ ఇన్‌చార్జి పుస్తె శ్రీకాంత్ ఆధ్వర్యంలో పురానాపూల్ విఠలేశ్వర వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నబత్తి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

- మెహిదీపట్నం

అమ్మమాట బడిబాటలో.. చైతన్య ర్యాలీ

నల్లకుంట డివిజన్ సత్యానగర్‌లో అంగన్‌వాడి టీచర్లు శుక్రవారం చిన్నారుల్లో చైతన్యం కలిగించడానికి అమ్మమాట..బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత పాల్గొన్నారు. అంగన్‌వాడి బడి ముద్దు..ప్రైవేటు బడి అసలే వద్దు..బిడ్డ సంక్షేమం..అంగన్‌వాడి ఆశయం అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ ప్రతిభ, హెల్పర్లు పాల్గొన్నారు.

- అంబర్‌పేట

బోనాల కులవృత్తుల సభ్యులకు ఉత్తమ సేవా అవార్డులు

గోల్కొండ జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ ఆలయం కులవృత్తుల సభ్యులను పాతనగరం శ్రీమహంకాళి మహేశ్‌గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవా అవార్డులతో సత్కరించారు. గురువారం రాత్రి రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో కులవృత్తుల సంఘం సభ్యులు బొమ్మల శ్రీకాంత్‌చారి, నర్సమ్మ పోచమ్మ, ఆర్.లలితాకుమారి, కుమ్మరి నర్సింగ్‌రావు, చాకలి రాజు లకు అవార్డులను అందించారు. లాల్‌దర్వాజ మహంకాళి ఆలయకమిటీ చైర్మన్ అరవింద్, మాజీ చైర్మన్ వెంకటేశ్ పాల్గొన్నారు.

- మెహిదీపట్నం

గుండుపోచమ్మ ఆలయానికి రూ.44 వేలు మంజూరు

మెహిదీపట్నం : లంగర్‌హౌస్ డివిజన్ అంబేద్కర్‌నగర్ గుండుపోచమ్మ బోనాలకు రూ.44 వేలు ప్రభుత్వం మంజూరు చేసింది. కాంగ్రెస్ నాయకుడు ఠాకూర్ జీవన్‌సింగ్ ఆలయ కమిటీ చైర్మన్ జి.వసంత్‌రెడ్డికి లంగర్‌హౌస్‌లో అందజేశారు. బుజిలి మహంకాళి, నల్లపోచమ్మ ఆలయాలకు రూ.44 వేల చొప్పున మంజూరైనట్లు తెలిపారు. గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ మహేశ్‌కుమార్, లంగర్‌హౌస్ నాయకులు ఇంద్రసేనా రెడ్డి, ఆరెళ్ల జగదీశ్‌యాదవ్ తదితరులు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం, జూలై 19 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ అరవింద్‌నగర్ ఫీడర్,11 కేవీ సూర్యనగర్ ఫీడర్,11 కేవీ అరుణా కాలనీ ఫీడర్,11 కేవీ ఆదిత్యనగర్ ఓవర్‌హెడ్ ఫీడర్,11 కేవీ మోతి మహల్ ఫీడర్ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

ఉదయం 10:30 నుంచి 12 గంటల వరకు..

అరవింద్‌నగర్, సమతా కాలనీ, అజీజ్ బాగ్, రాహుల్‌కాలనీ, రెయిన్‌బో అపార్టుమెంట్ ప్రాంతాలు

మధ్యాహ్నం 12 నుంచి 1:3 గంటల వరకు..

ప్రోఆగ్రోసీడ్స్, సూర్యనగర్, చాబ్రా ఎన్‌క్లేవ్, మహబూబ్ గార్డెన్, రాహుల్ కాలనీ, ఆడమ్స్ కాలనీ, అరుణా కాలనీ, జమాలి కుంట, నదీం కాలనీ, గ్రామర్ కాలనీ, పైలట్ పీటీ, ఝాన్సీనగర్, గోల్డెన్ ప్యాలేస్

మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30గంటల వరకు..

ఆదిత్యనగర్, సూర్యనగర్, ఛాబ్రా ఎన్‌క్లేవ్, మెరాజ్ కాలనీ, ఝాన్సిలక్ష్మీబాయి కాలనీ, మహబూబ్ గార్డెన్, ఝాన్సినగర్,7టూంబ్స్, రాఘవ కాలనీ, సమతా కాలనీ, కులీకుతుబ్‌షా, జమాలి కుంట, ఎండీ లైన్స్, శాతంనగర్, దుర్గానగర్, గ్రామర్ కాలనీ, పలీ కాలనీ, నదీం కాలనీ ప్రాంతాలు

'ది ఈఖో ఆఫ్ మై సౌల్' పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి, జూలై19 : తెలంగాణ ప్రభుత్వం, భాషాసాంస్కృతిక శాఖ, తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సూరం విఘ్నేశ్ అర్జున్ రచించిన ' ది ఈఖో ఆఫ్ మై సౌల్' పుస్తకావిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. సాహితీవేత్త నాళేశ్వరం శంకరం సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరి కృష్ణ, కవి పొట్లపల్లి శ్రీనివాస్, కార్తీక్‌రాజు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల కృష్ణమోహన్, మంధ్య శంకరయ్య పాల్గొన్నారు.

పత్రికా నిర్వహణ నేడు కష్ట సాధ్యమైంది

చిక్కడపల్లి, జూలై19 : ప్రతికా నిర్వహణ నేడు కష్టసాధ్యమైందని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. శనివారం సాయంత్రం త్యాగరాయగానసభలో సాహితీ కిరణం మాస పత్రిక 15వ వార్షికోత్సవాలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమణాచారి మాట్లాడారు. డాక్టర్ పింగళి జగన్నాథ స్మారక పురస్కారాన్ని దత్తాత్రేయ శర్మకు, సిరిగాద నర్సయ్య స్మారక సాహిత్య పురస్కారాన్ని రమణ వెలమకన్నికి, సిరిగాద బాలమ్మ స్మారక సాహిత్య పురస్కారం శైలజామిత్రికు, గట్టుపల్లి చెంచురామారావు స్మారక సాహిత్య పురస్కారాన్ని బండారుపల్లి రామచంద్రరావుకి ప్రదానం చేశారు. వెంకటరెడ్డి అధ్యక్షతన వహించిన ఈ సభలో సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, గాన సభ అధ్యక్షుడు కళా జనార్దన్ మూర్తి, నేటి నిజం పత్రిక సంపాదకుడు బైస దేవదాసు, ఎం.బాల గంగాధరయ్య పాల్గొన్నారు.

ఆశవర్కర్ల సమస్యలు అసెంబ్లీలో లేవనెత్తాలి



ఆశ వర్కర్ల సమస్యలు అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తి పరిష్కారానికి కృషి చేయాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. రూ.18వేల వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నెల మొదటి వారంలోనే జీతాలు ఇవ్వాలని, అర్హతగల వారికి ఏఎన్‌ఎం పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల రాష్ట్ర సంఘం అధ్యక్షులు ఆర్.సంతోష, ప్రధాన కార్యదర్శి కరుణ, రబియ అపర్ణ పాల్గొన్నారు.

- చిక్కడపల్లి

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని అంబర్‌పేట నియోజకవర్గం నల్లకుంట డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతల ధనార్జున్‌రెడ్డి, ఎడ్ల నరేందర్‌రెడ్డి, శరత్‌కుమార్ శుక్రవారం కలిశారు. రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా మంత్రిని కలిసి శాలువాతో సన్మానం చేశారు.

- అంబర్‌పేట

అభివృద్ధికి సహకరించండి

డివిజన్ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ కోరారు. లింగంపల్లిలోని బాలప్పబాడ, జమాల్‌బస్తీ బస్తీలు, ఏకే భవన్, శాంతినికేతన్ స్కూల్ ప్రాంతాల్లో మంజూరైన నూతన సీసీ రోడ్డును వేయడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం డీఎంసీ మారుతి దివాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, భీంయాదవ్, సుభాష్‌పటేల్, ఆర్.సంతోష్, రాహుల్ యాదవ్, అరవింద్, రవియాదవ్, సాగర్, రాము, దీపక్, సంతోష్ పాల్గొన్నారు.

- కాచిగూడ

కార్వాన్, జూలై19 : గుడిమల్కాపూర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బీజేపీ నాయకుడు వంశీ అన్నారు. మార్కండేయ నగర్‌లో రూ.26 లక్షల నిధులతో చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగాధర్, నామా యాదగిరి, అనిల్, సుధాకర్‌యాదవ్, సందేశ్‌యాదవ్, శ్రీధర్ పాల్గొన్నారు.

బీసీలకు రూ.2 లక్షల కోట్లు
కేటాయించాలి

మాట్లాడుతున్న గుజ్జ సత్యం

కాచిగూడ, జూలై 19 : పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో బీసీలకు రూ.2 లక్షల కోట్లను కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో బీసీ సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. గుజ్జ సత్యం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి బీసీల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నంద గోపాల్, ఉదయ్,మట్టా జయంతి, సురేశ్, పండరీనాథ్ పాల్గొన్నారు.

వీహెచ్‌కు ఆహ్వానం

అంబర్‌పేట మహంకాళి అమ్మవారి బోనాలకు రావాలని అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు మాజీ ఎంపీ వి.హనుమంతరావుకు ఆహ్వాన పత్రికను అందజేశారు. సేవా సమితి ముఖ్య సలహాదారుడు కె. దుర్గాప్రసాద్‌రెడ్డి, చైర్మన్ పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, వైస్ చైర్మన్ గడ్డం లక్ష్మణ్‌గౌడ్, అధ్యక్షుడు వై.శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రంగంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి బింది మల్లికార్జున్‌గౌడ్, కోశాధికారి గడ్డం శ్రీధర్ గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి చెంగలి సుధాకర్, కార్యదర్శి దోమకొండ కిశోర్, ఫైనాన్స్ కమిటీ చైర్మన్ పి.గిరిధర్‌గౌడ్ ఆహ్వానించిన వారిలో ఉన్నారు.

- అంబర్‌పేట

వృద్ధుడు మృతి

కాచిగూడ : ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(65) ఉందానగర్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం-2 చివర్లో అనారోగ్యంగా ఉంటూ గురువారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. మృతుడి ఒంటిపై ఆకుపచ్చ చొక్క, నషం రంగు ట్రాక్ ప్యాంట్ ఉందని, ఎత్తు 5.4 ఉన్నట్లు పేర్కొన్నారు. కేసులో ఉన్నది.

స్వచ్ఛత ప్రతిఒక్కరి బాధ్యత

జైస్వాల్‌గార్డెన్‌లో మట్టికుప్పలను తొలగింపజేస్తున్న కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.శ్రీనివాస్‌ముదిరాజ్

అంబర్‌పేట, జూలై 19 : గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్ కాలనీలో పేరుకుపోయిన మట్టి కుప్పలను కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.శ్రీనివాస్‌ముదిరాజ్ జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బందిచే తొలగింపజేశారు. ఆయన మాట్లాడుతూ.. మన ఆరోగ్యం మన ఇంటి పరిసరాల శుభ్రతపై ఆధారపడి ఉంటుందని, స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఇంటి పరిసరాలపు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే మంచి వాతావరణానికి దోహదపడినవారమవుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాజు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

నల్లకుంట డివిజన్ నర్సింహబస్తీలో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే ర్యాలీ నిర్వహించారు. నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అర్బన్ మలేరియా స్కీమ్ సిబ్బందితో కలిసి దోమల నివారణపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీపై జాగ్రత్త వహించాలని, దోమలు పెరగకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో బస్తీవాసులు, బీజేపీ నాయకుడు లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

అంబర్‌పేట కార్పొరేటర్ ఈ. విజయ్‌కుమార్ గౌడ్ శుక్రవారం డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ వరద నీటి కాలువపై నిర్మిస్తున్న మ్యాన్‌హోల్ క్యాచ్‌ఫిట్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బోనాల పండుగను పురస్కరించుకొని పనులు తొందరగా పూర్తి చేయాలని అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ దుర్గా, బీఆర్ఎస్ డివిజన్ అధికార ప్రతినిధి మహేశ్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

- అంబర్‌పేట

లాస్యకు బంగారు పతకం

రవీంద్రభారతి, జూలై 19: హైదరాబాద్‌కు చెందిన కారం చేటి రఘు, రవళి దంపతులు అమెరికాలోని డల్లాస్సోలో స్థిరపడ్డారు. వారి పుత్రిక లాస్య, అమెరికాలో మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి నిర్వహిస్తున్న భగవద్గీత మహా యజ్ఞంలో పాల్గొని 700 శ్లోకాలను కంఠస్థం చేసి, అయిదు అంచెలుగా జరిగిన ఎంపికలో 800 మందిలో పోటీపడి విజయం సాధించింది. ఈ సందర్భంగా గణపతి సచ్చిదానంద స్వామి లాస్యకు బంగారు పతాకాన్ని అందజేశారు.

గురువులకు నృత్య నీరాజనం

చిక్కడపల్లి, జూలై 19 : రాబోయే గురుపూర్ణిమను పురస్కరించుకుని బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో గురువులకు నృత్య నీరాజనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ నాయకుడు నగేశ్ ముదిరాజ్ హాజరై మాట్లాడారు. సంస్థ స్థాపకుడు విక్కీ మాస్టర్ అధ్యతన జరిగిన కార్యక్రమంలో సమాచార శాఖ విశ్రాంత కమిషనర్ ఆర్.వి. చంద్రవదన్, విశ్రాంత న్యాయమూర్తి మధుసూదన్, దైవజ్ఞశర్మ పాల్గొని నాట్య గురువులు రూపశ్రీ, శివ జ్యోతి, రాజరాజేశ్వరి, డాక్టర్ కృష్ణ ప్రియ, ఆనందమయి లను సన్మానించారు.

శివసంకల్పమస్తు పుస్తకావిష్కరణ

రవి అండ్ రవి ఆర్ట్స్ అసోసియేషన్ నాటక సాంస్కృతిక సంస్థ మల్లాపూర్ వారి 65వ వార్షికోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలోని సమావేశం మందిరంలో నాగభూషణం రక్తకన్నీరు, బల్లారి రాఘవ అవార్డు గ్రహీత మాడ్గుల వెంకటకృష్ణమోహన్ రచించిన శివసంకల్పమస్తు పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు.

- రవీంద్రభారతి

నకలు పొందేందుకు
దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 19: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఎస్-ఎంఎస్ కంప్యూటర్ సైన్స్ (ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు) మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్, ఎమ్మెస్సీ ఆడియాలజీ, ఎమ్మెస్సీ (స్పీచ్ - లాంగ్వేజ్ ప్యాథలజీ) కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 1లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.10 వేల చొప్పున చెల్లించి వచ్చే నెల 19వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac.inలో చూసుకోవచ్చన్నారు.

బీపీఈడీ, డీపీఈడీ పరీక్షా తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 7, 8 తేదీలలో రాష్ట్ర ప్రభుత్వ గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆ రోజు నిర్వహించాల్సిన పరీక్షలను వాయిదా వేసినట్లు చెప్పారు. ఈ పరీక్షలను తిరిగి వచ్చే నెల 16, 17 తేదీలలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలి

గో మాత హిందువుల ఆరాధ్య దైవమని హిందువులు భక్తితో కొలిచే గోమాతను కేంద్ర ప్రభుత్వం జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బజరంగ్‌సేనా అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ నేతృత్వంలో శుక్రవారం ముస్తీంజంగ్‌పూల్‌లోని భూలక్ష్మీమాత ఆలయం వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించే వరకు తమ ఉద్యమం ఆగదని పేర్కొన్నారు.

- కార్వాన్